ప్రజాశక్తి
శనివారం 4 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి



చిన్న కుళ్లాయప్ప క్యారికేచర్‌కు అంతర్జాతీయ బహుమతి

ప్రజాశక్తి-నార్పల

అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ ఈజిప్ట్ కార్టున్ ఫ్లాట్ ఫాం 'కార్టూన్, ఎల్‌నాస్‌ఎల్‌హెల్వా-2025 అంతర్జాతీయ విజేతలను ఇటీవల ప్రకటించింది. ఇందులో క్యారికేచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి పలువురు కార్టునిస్ట్‌లు.. పోటీ పడ్డారు. ఇందులో భారతదేశం నుంచి అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన చిన్న కుళ్లాయప్ప (చిన్ని ఆర్ట్స్) సత్తా చాటారు. ఈయన క్యారికేచర్‌కు ద్వితీయ స్థాయి అంతర్జాతీయ అవార్డు లభించింది. చిన్న కుళ్లాయప్ప కేశేపల్లి హైస్కూల్‌లో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన క్యారికేచర్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డుకు ఎంపికైన క్యారికేచర్

నేడు 'ఆటోడ్రైవర్ల సేవ'లో..

◆ ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక తోడ్పాటు

◆ నేడు ఖాతాల్లో డబ్బులు జమ

◆ అనంతలో భారీ ఆటోల ర్యాలీ





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక తోడ్పాటును అందించే కార్యక్రమాన్ని నేడు ప్రారంభించనుంది. దీనికి 'ఆటో డ్రైవర్ల సేవ'లో అని పేరు పెట్టింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లాలోనూ ప్రజాప్రతినిధులు పథకం ప్రారంభించనున్నారు. ఇప్పటికే అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. గత నెలలో అనంతపురం నగరంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దసరాకు ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఇస్తామని చెప్పారు. ఈ మేరకు ఈ పథకాన్ని శనివారం ప్రారంభించనున్నారు.

అనంతపురంలో అత్యధికం

ఆటో డ్రైవర్ల సేవలో పథకం కోసం ఇది వరకే దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 9967 మంది దరఖాస్తు చేసుకుంటే 9275 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. దీనికి మొత్తంగా రూ.13.91 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇక మండలాల వారీగాచూస్తే అత్యధికంగా అనంతపురం రూరల్ మండలంలో ఉన్నారు. రూరల్ పరిధిలో 1434 మందిగా, అనంతపురం అర్బన్‌లో 1137 మంది అర్హులున్నారు. ఇందులో అత్యల్పంగా చూసినప్పుడు బొమ్మనహాళ్ మండలంలో 18 మంది మాత్రమే ఈ పథకం కింద అర్హులున్నారు. ఇక నియోజకవర్గాల వారీగా చూసినప్పుడు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1137 మందికాగా, గుంతకల్లు నియోజకవర్గంలో 1655, రాప్తాడు నియోజకవర్గంలో 1752 మంది, తాడిపత్రిలో 1614 మంది శింగనమల నియోజకవర్గం పరిధిలో1643 మంది అర్హులున్నారు. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 323 మంది, రాయదుర్గం నియోజకవర్గంలో 343 మంది అర్హులున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 808 మంది ఉన్నారు. మొత్తంగా 9275 మంది అర్హులుండగా రూ.13.91 కోట్ల నిధులు ఈ పథకం కింద జిల్లాలో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు వేయనున్నారు.

'అనంత'లో ర్యాలీ సభ

ఆటో డ్రైవర్ల సేవ పథకం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయం నుంచి సభ జరిగే కెఎస్‌ఆర్ కళాశాల వరకు ఆటో ర్యాలీని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో ప్రకటించిన ప్రకారం నేడు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక తోడ్పాటును అందివ్వనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో జిల్లాకు అవార్డులు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు దక్కాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి 2 రాష్ట్రస్థాయి, 47 జిల్లా స్థాయి అవార్డులు దక్కాయన్నారు. రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు వచ్చాయని, స్వచ్ఛ ఇండస్ట్రీస్‌లో భాగంగా కియో ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌కు బెస్ట్ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా కదిరి మండలానికి చెందిన గురువుపల్లి ఎస్.దొడ్డప్పకు దక్కయన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో ఈనెల 6న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకుంటారన్నారు. జిల్లా స్థాయిలో కూడా 47 మందికి జిల్లా మంత్రుల చేతుల మీదుగా అవార్డులు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ గురించి ప్రజలలో అవగాహన పెంపొందించుకోవడానికి కృషి చేయాలన్నారు. సామాజిక వన విభాగం వద్ద 15 లక్షల మొక్కలు ఉన్నాయని, ప్రజలు తీసుకెళ్లి ఈ వర్షాకాలంలో వాటిని నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, అటవీ శాఖ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్

పాడిరైతుల సంక్షేమాభివృద్ధిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వాలు సాయం అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు యూనిట్ల విభాగంలో లబ్ధిదారులను ఎంపిక చేసి గోకులం నిర్మాణాలు చేపట్టింది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న ఆశతో పాడి రైతులు సొంత డబ్బులతో నిర్మాణాలు పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బిల్లులు రాక రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



రాంపురంలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్లు

గోకులం.. బిల్లులు అందని వైనం..!

◆ సత్యసాయి జిల్లాలో 1335 మంజూరు.. 909 నిర్మాణం పూర్తి

◆ నెలలు గడుస్తున్నా అందని బిల్లులు

◆ పాడి రైతులకు తప్పని ఎదురుచూపు

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులను పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఉపాధిహామీ పథకం కింద 90 శాతం రాయితీతో రైతులకు గోకులంషెడ్లను మంజూరు చేశారు. అందులో భాగంగా పశు సంవర్ధకశాఖ అధికారులు శ్రీసత్యసాయి జిల్లాకు 1335 గోకులం షెడ్లు మంజూరు చేశారు. పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 184 పంచాయతీలకు 607 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయి. పెనుకొండ నియోజకవర్గంకు 212, మడకశిరకు 213, హిందూపురానికి 182 గోకులం షెడ్లు అధికారులు కేటాయించారు. పెనుకొండ 140, మడకశిరా 213, హిందూపురం 182 షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ మూడు నియోజకవర్గాల్లో 196 షెడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సిఉంది.



కొడంపల్లి గ్రామంలో పూర్తియిన గోకులం షెడ్డు

నెలలు గడుస్తున్నా బిల్లులు అందక రైతులు ఆందోళన

గోకులం షెడ్ల బిల్లులు అందక ఇబ్బంది పడుతు న్నట్లు పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్ నిర్మాణం పూర్తయ్యి నెలలు గడిచినా బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 909 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.5.25 కోట్లు బిల్లుల బకాయిలున్నాయి. కొంత మంది రైతులకు మాత్రం అరకొర బిల్లులు పడినట్లు సమాచారం. దసరా పండుగకైనా బిల్లులు వస్తాయేమోనని ఎదురుచూసిన పాడి రైతులకు నిరాశే ఎదురైంది. కొందరు రైతులు మంజూరైన గోకులంషెడ్లను వదులుకోలేక అప్పు తెచ్చి షెడ్లను నిర్మించుకున్నారు. నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. బిల్లుల కోసం పశు వైద్యశాలలు, ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయామని రైతులు వాపోతున్నారు.

మూడు రకాలుగా గోకులం షెడ్లు

ప్రభుత్వం అర్హులైన రైతులకు 90 శాతం రాయితీతో మూడురకాల గోకులం షెడ్లను మంజూరు చేసింది. పాడి పశువుల సంఖ్యను బట్టి గోకులం షెడ్ల నిర్మాణ యూనిట్లను పశువైద్యులు ఎంపిక చేశారు. రెండు పశువులు ఉంటే రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉంటే రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉంటే రూ.2.30 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రైతువాటా 10 శాతం చెల్లిం చాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది.

షెడ్డు యూనిట్ విలువ..రాయితీ..

2 పశువులు రూ..1.15 లక్షలు యూనిట్ వ్యయం కాగా ప్రభుత్వం వాటా రూ.1,03,500, రైతు వాటా రూ.11,500. 4 పశువులుంటే రూ.1,85,000 యూనిట్ విలువ కాగా రూ.1,66,500 ప్రభుత్వం వాటా, రూ.18,500 రైతు వాటా, 6 కన్నా ఎక్కువుంటే రూ.2,30,000 యూనిట్ విలువ కాగా ప్రభుత్వం వాటా రూ.2,07,000, రైతు వాటా రూ.23,000, 20 గొర్రెలు, మేకలకు యూనిట్ విలువ రూ.1,30,000 కాగా ప్రభుత్వ వాటా రూ.91,000, రైతు వాటా రూ.39,000. 50 గొర్రెలు, మేకలుంటే రూ.2,30,000యూనిట్ విలువ కాగా ఇందులో ప్రభుత్వ వాటా రూ.1,61,000, రైతు వాటా రూ.69,000, 100 కోళ్ల యూనిట్ విలువ రూ.87,000 కాగా ప్రభుత్వ వాటా రూ.60,900, రైతు వాటా రూ.26,100, 200 కోళ్ల యూనిట్ విలువ రూ.1,32,000 కాగా ప్రభుత్వ వాటా రూ.92,400, రైతు వాటా రూ.39,600 గా ప్రభుత్వం నిర్ణయించింది.

అధికారుల వివరణ ఇలా..

పూర్తయిన గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులు ఆన్లైన్లో అప్లోడ్ చేశామని, కొంత మంది రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ డబ్బులు జమైనట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన బిల్లులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని బడ్జెట్ విడుదల అయిన వెంటనే గోకులం షెడ్లు రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని వారు వివరిస్తున్నారు. జిల్లాలో 426 మంది రైతులు షెడ్ల నిర్మాణం పూర్తికావాల్సి ఉందని వారుకూడా త్వరగా షెడ్లను పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరగా మంజూరు అవుతాయని ఉపాధి హామీ అధికారులు పేర్కొంటున్నారు.

బిల్లులు తక్షణం మంజూరు చేయాలి

అప్పుచేసి గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టిన పాడి రైతులకు తక్షణం బిల్లును మంజూరు చేయాలి. నిర్మాణాలు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సబబు కాదు. కేంద్ర ప్రభుత్వం వాటాగా మంజూరు చేయాల్సిన నిధులను తక్షణం విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలి.

హరి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

విద్యా శాఖలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ,జేఏసీ నాయకులు వరప్రసాద్, భాస్కర్ ,ఓబులేసు, ముకుంద రెడ్డి డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి ఈనెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న పోరాట సభకు సంబంధించిన పోస్టర్లను ఈసందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 విభాగాలలో జిల్లా కార్యాలయాల్లో అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగాను, ఫిజియోథెరపిస్టులుగా పని చేస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరం నుండి పనిచేస్తున్న తమని ప్రభుత్వం పర్మనెంట్ చేయలేదన్నారు. సమగ్ర శిక్షణలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఉద్యోగులకు హెచ్‌ఆర్‌పి అమలు చేయాలని మినిమం టైం స్కేల్ హెచ్ఆర్ఎ, డిఎ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, రామ్మోహన్ రెడ్డి, హేమలత, భాస్కర్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని సచివాలయ భవనం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని ఉబిచెర్ల సచివాలయ భవన నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. రెండేళ్ల క్రితమే సచివాలయం, రైతు సేవ కేంద్రం,ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ఆ భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవటంతో సంబంధిత కాంట్రాక్టర్ ఆ భవనాలను అధికారులకు అప్పగించలేదు. బిల్లులు చెల్లిస్తే తప్ప భవనాల అప్పగించే ప్రసక్తే లేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఈ విషయంపై సంబంధి ఏఈ వివరణ అడగ్గా సచివాలయ భవనానికి సంబంధించిన చిన్న చిన్న పనులు సకాలంలో చేయకపోవడం వలన బిల్లులు ఆలస్యమయ్యాయన్నారు. ప్రస్తుతం బిల్లులను సంబంధిత ఉన్నతాధికారులకు పంపామని త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.

డీఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కోటపల్లిలో కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ గోపీతో కలసి గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రత, నియమాలు, శక్తి యాప్ వినియోగం, మహిళలు మరియు పిల్లలపై నేరాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సత్యసాయి జయంతి వేడుకలు

కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలియజేశారు. బాబా శతజయంతి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ సతీష్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఇతర అధికారులతో శుక్రవారం కలిసి పరిశీలించారు. ప్రశాంతి నిలయంలోని వెస్ట్ గేటు వద్ద ప్రముఖులు, విదేశీ భక్తులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వేరువేరుగా దారులు ఏర్పాటు చేసేలా అధికారులకు సూచనలు చేశారు. వడ్డీవంక వద్ద ఏపీఐఐసి ఇండస్ట్రియల్ పార్కు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఎత్తు పల్లాలు ఉన్న ప్రదేశాలను చదును చేయించాల్సిన అవసరం ఉందన్నారు. సత్యసాయి ఎయిర్‌పోర్టును సందర్శించి ప్రముఖులు, వివిఐపిలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో పరిశీలించారు. ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస అతిథి గృహం, ప్రైమరీ స్కూల్, ఈశ్వరమ్మ హైస్కూల్ తదితర ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ముఖ్యంగా పట్టణంలో పార్కింగ్ స్థలాలను రవాణా సౌకర్యాలకు సంబంధించిన వాహనాలు నిలుపు ప్రదేశాలను, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను ఆయా శాఖల అధికారులు ముందస్తుగా ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సత్యసాయి ట్రస్టు సభ్యులు చలం, తహశీల్దార్ కళ్యాణ్, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి : డిఇఒ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ క్రిష్టప్ప

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప పేర్కొన్నారు. నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హిందూపురం పట్టణ సమీపంలోని బిట్ కళాశాలలో పరిచయ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపికైన అభ్యర్థులు గతాన్ని మర్చిపోకుండా వృత్తిలో నైపుణ్యతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గతంలో ఎన్నో కష్టనష్టాలు అనుభవించి ఎంతో లక్షల మందితో పోటీపడి ఉపాధ్యాయులుగా వచ్చారన్నారు. ఉపాధ్యాయ జీవితంలోకి ప్రవేశిస్తున్నారని అదే తరుణంలో సేవల గురించి మరచిపోకూడదని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల వద్ద సత్సంబంధాలు కలిగి బాగా పనిచేసి విద్యార్థుల అభివృద్ధి కి కృషి చేయాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ఎక్కడికి కేటాయించినా మెరుగైన విద్యా బోధన సాగించాలన్నారు. సిఎంఒ మాలిక్, ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, శేషాచలం మాట్లాడుతూ శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణా తరగతుల్లో శిక్షకులు చెప్పే విషయాలను సమగ్రంగా అర్థం చేసుకుని విషయాలు నేర్చుకుని పాఠశాలకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిజిఎస్ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్రబాబు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బాలాజీ నాయక్, నర్సిరెడ్డి, శేఖర్ బాబు, రామాంజనేయులుతో పాటు శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి వైద్యులు

4వ రోజు పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగవ రోజుకు చేరింది. శుక్రవారం స్థానిక డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం ముందు నాలుగవ రోజు వైద్యులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. నల్ల రిబ్బన్లు ధరించి మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల నుండి నిరవదిక సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని, కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయక సేవలు అందించామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేంద్ర, దిలీప్ కుమార్, డాక్టర్ ముని చంద్రిక,నికేస్ , స్వరూప రెడ్డి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

19నెలల చిన్నారికి వండర్ బుక్ అఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - రొద్దం

19నెలల చిన్నారి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించాడు. మండలంలోని రొద్దం గ్రామానికి చెందిన అనూష, చైతన్య గణేష్ దంపతుల రెండవ సంతానం జైమీన్ అనే బాలుడి వయస్సు 19 నెలలు. ఈ బాలుడు 21రకముల పండ్లు,42రకముల జంతువుల పేర్లు, 22రకముల కూరగాయలు, పేర్లు,15రకాల వాహనాల పేర్లు,25రకముల పక్షులు పేర్లు,20రకములు పువ్వులు,20రకముల సమాజ సేవకులు పేర్లు,6జాతీయ చిహ్నములు,వాటి పేర్లు,52పురాణ హితిహాసములలో ప్రశ్నలకు సమాధానములు, 8రకముల రంగులు,10శ్లోకములు,తెలుగు వారాలు, నెలలు,ఇంగ్లీష్ వారాలు, నెలలు,శారీర భాగములు పేర్లు, ఏ నుంచి జడ్ వాయికు ఆల్ఫాబెటికల్ పదములు చురుకుగా చెప్పున్నట్లు బాలుడి తాత లక్ష్మినారాయ గుప్తా తెలిపారు. దీంతో ఈ బాలుడి పేరు వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు చేసుకుందన్నారు. 5రోజుల క్రితం అందుకు సంబంధించిన సర్టిఫికెట్ తమకు అందినట్లు లక్ష్మినారాయణ గుప్త తెలిపారు.



జైమీన్

కదిరిలో ఆక్రమణల జోరు


చెత్తతో నిండిన మద్దిలేరు వాగు

కుచించుకుపోతున్న కోనేరులు, వాగులు
భారీ వర్షాలు వస్తే పట్టణానికి ముంపు ప్రమాదం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఆక్రమణ జోరు కొనసాగుతోంది. దీంతో ఆలయాల కోనేరులు కుచించుకుపోతున్నాయి. అంతేకాక కోనేరుల్లో చెత్త చెదారం వేసి కలుషితం చేస్తున్నారు. ప్రసిద్దిగాంచిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి పుష్కరిణి భృగుతీర్థం, మద్దిలేరు వాగు కలుషితమవుతోంది. పట్టణంలో మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్త ఇతర వాటిని మున్సిపల్ ఆటోలు వాహనాలలో అక్కడికి తీసుకొచ్చి డంపింగ్ యార్డ్‌లో వేసినట్లు మద్దిలేరువాగులో వేన్నారు. అలాగే చికెన్ వ్యర్థాలు పాత ఇళ్ల నుంచి తొలగించిన సామాగ్రిని సైతం మద్దిలేరు వాగులో వేస్తున్నారు. దీంతో మద్దిలేరు వాగు ఆక్రమణకు గురై రోజురోజుకు కుచించుకుపోతోంది. ఇలాంటి వాటితో మరో మారు పట్టణానికి ముంపు తప్పదా అన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాల నుండి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు మద్దిలేరు వాగులో స్నానమాచరించి శ్రీవారిని దర్శించుకునేవారు. అలాంటి తీర్థాన్ని ప్రస్తుతం మురుగు నీటి కాలువల మార్చేసిన పరిస్థితి ఏర్పడింది. కదిరి పట్టణం కి సమీపాన తూర్పు దక్షిణం వైపున గల మదనపల్లి రోడ్డు లోని పుట్టమాను చెరువు, దేవర చెరువు, నల్లచెరువు మండలంలోని పంతల చెరువు, రాయచోటి రోడ్ లోని ఇటికి రాతి చెరువు , బేరిపల్లి కుంట ల నుండి ప్రవహించే మరవ నీరు ఒక చోటికి చేరుకొని కదిరి పట్టణం గుండా దాదాపు 160 అడుగుల విస్తీర్ణం తో మద్దిలేరు వాగు ప్రారంభమై 60 కిలోమీటర్లు ప్రవహించి చిత్రావతి నదిలోకి చేరుతుంది. ఇలాంటి వాగును మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డ్‌గా మార్చారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.కదిరి పట్టణంలో సేకరించిన చెత్తను ఇతర వ్యర్థాలను ఆటోలో తరలించి అక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో స్వయంగా మున్సిపల్ సిబ్బంది వాగును ఆక్రమణకు గురి చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలలో నివసించే ప్రజలు పాత ఇంటి మట్టిని ఇటుకులను, తరలించి అందులో వేస్తున్నారు. అలాగే చికెన్ సెంటర్ నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను సంచుల్లో తరలించి అక్కడే వేస్తున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కదిరి పట్టణం నానా దర్గా నుండి హిందూపురం రోడ్డు కోనేరు వరకు మద్దిలేరు వాగును ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అలాగే చెట్లు పిచ్చి మొక్కలు మొలచి వాగు ప్రవహించడానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మూడు సంవత్సరాల క్రితం భారీ వర్షాల దాటికి మద్దిలేరు వాగు సమీప ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరిన ఘటన చోటుచేసుకుంది. అలాగే భారీ వర్షాలకు స్వామివారి కోనేరు సైతం అప్పట్లో కొట్టుకుపోయింది. ఆ వర్షాలు దాటికి భారీ ఆస్తి నష్టం కలిగింది. ఇంతటి నష్టంకళ్ళముందే కనపడుతున్న ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు ఇప్పటికీ పాఠాలు నేర్వలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు మద్దిలేరు వాగును పరిశీలించి వాగులో మొలిచిన చెట్లను పిచ్చి మొక్కలను, తొలగించాలని అలాగే ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైద్యం కావాలంటే ఓటీపీ చెప్పాలా..? : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి ప్రాంతీయ వైద్యశాలలో వైద్యం పొందాలంటే ఓటిపి చెప్పాలంటున్నారని, ఈ నేపథ్యంలో ఫోన్లు తెచ్చుకోని రోగుల పరిస్థితి ఏమిటని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి ప్రాంతీయ వైద్యశాలకు 10 మండలాల నుంచి అనేకమంది రోగులు వస్తుంటారన్నారు.. ఓపి చీటి రాయడానికి ఓటీపీ నెంబర్లు అడుగుతున్నారని చాలామంది ఫోన్లు తెచ్చుకోలేని వారు గంటల తరబడి నిల్చున్న వారి పేర్లు రాయడం లేదని అన్నారు. ప్రతిరోజు 600 మంది దాకా రోగులొస్తుంటారని చెప్పారు. ఇక ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని విమర్శిఃచారు. మరుగుదొడ్డి కేవలం ఒక్కటే ఉండడంవల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా వర్షాకాలంలో విష జ్వరాలు వచ్చి రక్త పరీక్ష చేయించుకోవడానికి సిబ్బంది తగినంతమంది లేరన్నారు. నలుగురు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరే ఉండడంవల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబందిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్ మోహన్, బాబ్జాన్, రామ్మోహన్,సుధాకర్ రెడ్డి, రఫీ, ఆంజనేయులు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్వయం ఉపాధిపై శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

సేవామందిర్ సంస్థ ఆధ్వర్యంలో సేవామందిర్ సంస్థ ప్రాంగణంలో వృత్తివిద్యా నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత కొన్నేళ్లుగా సేవా మందిరం సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. 2025-26 సంవత్సరానికి గాను ఈ జులై నుండి బ్యాచులవారీగా శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ధ్రువీకరణ పత్రంతో పాటు, ఎంఎస్ఎంఇ సొంత పరిశ్రమ స్థాపనకు అవసరమైన సహకారం అందించడం జరుగుతుందన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, రెడీమేడ్ గార్మెంట్స్ మేకింగ్, స్ప్రైసెస్, మసాలా పౌడర్స్ తయారీ, పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, హెర్బల్ షాంపు, పౌడర్ల తయారీ, బ్యూటీషియన్ కోర్స్, బేకరీ ఐటమ్స్, స్వీట్లు తయారీ, శానిటరీ న్యాప్కిన్స్ తయారీ, ఎలక్ట్రీషియన్ ట్రెనింగ్, ప్లంబర్ విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి విద్యార్హతలు లేకపోయినా 18 సంవత్సరముల నుండి 55 సంవత్సరముల లోపు వయసు కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆధార్, రేషన్ కార్డుల, కుల ధ్రువీకరణ, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో సేవా మందిరం సంస్థ ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం 7989110294, 9392492324 నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు. ఆసక్తి కల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి పెనుకొండ

పౌష్టిహారంపై అవగాహనా ర్యాలీని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారంలో పోషకవిలువలు కోల్పోకుండా వారు ఇష్టపడేలా రుచికరంగా తయారు చేయాలని తెలిపారు. ఆకుకూరలు ఆహారంలో తప్పని సరిగా భాగం చేయాలన్నారు. పోషకహారం ప్రాముఖ్యతను గురించి, మంచి ఆరోగ్యానికి దోహదపడే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు,చిరుధాన్యాలు గురించి అంగన్ వాడి కార్యకర్తలకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్లు అనురాధ, విజయలక్ష్మి, పెనుకొండ రొద్దం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీలు, ఐసిడిఎస్ సిబ్బంది

ఆ పంచాయతీ కార్యదర్శి మోనార్క్..

అధికారి అనుమతి లేకుండా దర్జాగా సెలవుల్లోకి..

ప్రజాశక్తి- పరిగి

పరిగి మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో మోనార్క్‌లు ఎక్కువయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగస్తులలో రాజకీయాలు మొదలయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉన్న ఉద్యోగికి సెలవు కావాలంటే ఎవరి పర్మిషన్ లేకపోయినా ఒక లెటర్ రాసి పడేసి వెళ్లిపోతే చాలు అన్నట్లుగా మారింది. అందుకు ఉదాహరణ మండలంలోని పైడేటి పంచాయతీ కార్యదర్శి సెలవును తీసుకోవచ్చు. కార్యదర్శి సంజప్ప 1,3వ తేదీల్లో సెలవు కావాలని ఒక లెటర్ రాసి ఏవో అశ్వత్తప్పకి అందించారు. అయితే ఆ లెటర్ ఎంపీడీవో రెడ్డప్ప దృష్టికి వెళ్లలేదు. కనీసం పంచాయతీ కార్యదర్శులు కార్యాలయంలో ఉన్నారా లేదా కూడా పట్టించుకునే స్థితిలో అధికారులు ఉన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన గ్రామంలో పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమం ఉంటుందని తెలిసి కూడా ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు అధికారుల అనుమతి లేకుండా సెలవు తీసుకున్నారంటే ఇక్కడ ఎవరి ఇష్టానికి వారు తయారవుతున్నారన్న పరిస్థితి నెలకొందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పైడేటి సచివాలయం పనిచేసే మరో ఉద్యోగి వెల్ఫేర్ శంకర్‌కుకాల్ చేసి పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉన్నారా అని అడిగితే 'సారు లీవ్ లో ఉన్నారు శుక్రవారం కార్యాలయానికి రాలేదు' అని తెలిపారు. అయితే ఆ సెలవు ఏ ఒక్క ఉన్నత అధికారి కూడా చూడలేదు. ఇంత జరుగుతున్న అధికారులు మౌనంగా ఉండటం చూస్తుంటే అధికారులు ఏ స్థాయిలో కిందిస్థాయి ఉద్యోగులకు సపోర్టుగా ఉన్నారో అర్థమవుతుంది. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి విచారణ చేసి ఎంపీడీవో కార్యాలయంలో ఇష్టారాజ్యంగా తయారైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - పరిగి

దసరా సెలవులను పురస్కరించుకొని పరిగి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, ఏపీ ఆర్ ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురవారం ముగిసాయి. ఈపోటీల్లో 24 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీల్లో విజేతగా నిలిచిన పరిగి లెవెన్‌జట్టు నిలిచింది. విజేత జట్లుకు నిర్వాహకులు హనుమయ్య రూ. 15వేలు, రన్నర్‌జట్టుకు రూ. 7500లు అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా కోడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ ఎక్సెన్స్ పాఠశాలలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన కొడిగెనహళ్లి జట్టుకు రూ పదివేలు నగదును నిర్వాహకుడు సోమప్ప బహుకరించారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేత

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత బుక్కపట్నం

ప్రజాశక్తి -బుక్కపట్నం

మండల కేంద్రంలో పల్లె ఉమా జ్ఞాపకార్థం మన ఊరు మన ఆట మన పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో బుక్కపట్నం జట్టు విజేతగా నిలిచింది. జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో దాదాపు 24 టీములు పాల్గొనగా బుక్కపట్నం, కుంటిమద్ది జట్లు ఫైనల్ పోటీలో తలపడ్డాయి. ఈ పోటీలు విజేతగా నిలిచిన బుక్కపట్నం జట్టుకు మొదటి బహుమతిగా 20వేల రూపాయల నగదు, ట్రోఫీ, రెండవ బహుమతిగా కుంటిమద్ది జట్టుకు 15వేల రూపాయల నగదు ట్రోఫీని దాతల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగదీష్, సంతోష్, సాయి, అంజి తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

స్నేహితుడి కుటుంబానికి అండగా...


స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బుకపట్నం

పదవ తరగతిలో తమతో పాటు చదువుకున్న తోటి స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. బుక్కపట్నం మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 1999 వ బ్యాచ్ చెందిన పదవ తరగతి విద్యార్థులు శుక్రవారం మండల కేంద్రానికి చెందిన తమ మిత్రుడు షంషీర్ కుటుంబానికి చేయూతను అందించారు. షంషీర్ దుబాయిలో పనిచేస్తూ గతంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో తోటి స్నేహితులు మిత్రుడు కుమార్తె వివాహానికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు. రూ.70వేల నగదు, పట్టు చీర ఇతర సామాగ్రిని అందించి తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. తమ మిత్రుడు చనిపోయినప్పటికీ ఆ కుటుంబానికి అండగా ఉండాలని ఉద్దేశంతో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, చంద్ర, నారాయణస్వామి, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ ఆటో ర్యాలీ

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా పట్టణంలో శనివారం భారీ ఆటో డ్రైవర్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు టిడిపి పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. ఉదయం 10 గంటలకు పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి ఈ ఆటో ర్యాలీ ప్రారంభమై కర్నాటక నాగేపల్లి వంతెన, చిత్రావతి రోడ్డు, డీఎస్పీ కార్యాలయం నుంచి గణేష్ సర్కిల్ వరకు ఈ ఆటో ర్యాలీ కొనసాగుతుందని నాయకులు తెలిపారు. 11 గంటలకు సాయి ఆరామంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, కూటమి నాయకులు ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆటో కార్మికులు, కూటమి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

జీఎస్టీ తగ్గింపు .. ధరలపై మండలకేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇరిగేషన్, నిత్యావసర వస్తువులు, వ్యవసాయ ట్రాక్టర్లు తదితర వాటిపై జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ మాట్లాడుతూ నానో డిఎపి, నానో యూరియా వాడకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగారావు, అనిల్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ భాస్కర్ రెడ్డి తదితర అధికారులతో పాటు టీడీపీ నాయకులు హర్ష, గణేష్, శంకర్ నాయుడు, రామ్మోహన్, పర్టిలైజర్ షాపు యజమానులు, రైతులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఓబులదేవరచెరువు

ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా ఫ్యాప్టో జిల్లా నాయకులు గౌస్ లాజమ్ కోరారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని శ్రీదుర్గా పాపనాశేశ్వర వీరభద్రస్వామి ఆలయంలో దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ జయప్ప కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమనందన్, ఎంపిటీసీ లలితమ్మ, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ మునీర్ అహ్మద్, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారికాంబ దీపోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం డి.ఆర్ కాలనీలో మారికాంబ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి లక్ష్మీబాయి, శ్యామ్, మోహన్ నాయక్, చరణ్ రాజ్ నాయక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌టీఆర్ వైద్య సేవలు జిల్లా సమన్వయాధికారి డాక్టర్ శ్రీదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రసవ గది, 104 ఆరోగ్య వాహనాన్ని పరిశీలించారు. వైద్యులు సమ్మె చేస్తున్న సందర్భంలో బయటి రోగులకు సేవలు సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర అధికారి జయచంద్రకుమార్, ఆరోగ్య కార్యకర్తలు లీలావతి, కవిత, 104 వాహన డ్రైవర్, 104 డేటా ఎంట్రీ ఆపరేటర్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని విజయనగర కాలనీకి చెందిన తాజున్నీసా అనే మహిళకు మాజీ సర్పంచి మాణిక్యం బాబా కుట్టుమిషన్‌ను అందజేశారు. కిత్మాత్ ఏ కల్కి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శామీర్ సహకారంలో పేద మహిళకు ఈ చేయూతను అందజేశారు. ఈ కార్యక్రమంలో అలీ, హన్ను, జావేద్, పాల్గొన్నారు.

మిథున్ రెడ్డిని కలిసిన వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్, పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డిని హిందూపురం వైసిపి నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి శుక్రవారంకలిశారు. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై ఇటీవల బెయిల్ పై విడుదలైన మిథున్ రెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తలకు సంబంధించిన విషయాలు తదితర అంశాలపై వేణురెడ్డి మిథున్ రెడ్డితో చర్చించారు.


మిథున్‌రెడ్డితో వేణురెడ్డి

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని దొరిగల్లు గ్రామం ఎస్సీ కాలనీలోని ఓ ఇంటిలోకి కారు దూసుకెళ్లింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న నాలుగేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. చింపిరి బాలాజీ అనే యువకుడు దసరా పండుగ రోజు కారుకు పూజ చేయించుకొని ఇంటికి వెళుతున్నాడు. ఈ సందర్భంగా కారు అదుపుతప్పి గ్రామంలోని ఎస్సీకాలనీలోని ఓ ఇంటిలోకి దూసుకుపోయింది. ఇంట్లో ఉన్న ఆదెమ్మ అనే మహిళ ను, నాలుగేళ్ల నిఖిల్ అనే బాలుడిని కారు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయపడిన మహిళ చికిత్స పొందుతోంది.


బాలుడు నిఖిల్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమని అడ్మినిస్ట్రేటీవ్ అధికారిని ఖతిజున్ కుబ్రా హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సమావేశం లో డివిజన్ పరిధిలో గల వైద్య శాఖ అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు , తహశీల్దార్లు , రోటరీ క్లబ్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న అధికారిణి

కష్టానికి తగిన గుర్తింపు : బత్తల

ప్రజాశక్తి కదిరి టౌన్

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తనకు అధిష్టానం తగిన గుర్తింపును ఇచ్చిన వైసిపి కదిరి నియోజకవర్గ నాయకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ అన్నారు. బత్తల హరిప్రసాద్‌ను వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ తన పై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను అంకిత భావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకి ఈ అవకాశం రావడానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి , సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ , పార్లమెంట్ పరిశీలకులు. రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు . ఈసందర్భంగా పలువురు వైసిపి నాయకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను సన్మానించారు.


బత్తలను సన్మానిస్తున్న నాయకులు

నల్లచెరువు :వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికైన డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను ఆపార్టీ నల్లచెరువు మండల నాయకులు సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్ రెడ్డి, దశరథ నాయుడు, శ్రీధర్ రెడ్డి, ఉబ్బిచర్ల సర్పంచి సమీవుల్లా, మాజీ ఎంపిటీసీ రమణ, కల్లిపల్లి శ్రీనివాసులు, లక్ష్మీ పతి రెడ్డి, దొడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే పాఠశాల మూత

ప్రజాశక్తి - పరిగి

దసరా సెలవుల అనంతరం మొదటిరోజు శుక్రవారం మండలంలో పాఠశాలల అంతంతమాత్రంగానే కొనసాగాయి. అసలే దసరా సెలవులు పది రోజులు ముగిసిన తర్వాత కూడా పాఠశాలకు వచ్చేందుకు ఇటు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా నిరాసక్తిని చూపినట్లు తెలుస్తోంది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహానికి లోనయ్యే పరిస్థితి చోటు చేసుకుంది. కొన్ని పాఠశాలల్లో పని వేళల్లో కూడా స్కూల్‌కు ఉపాధ్యాయులు గైహాజరవుతున్న పరిస్థితి నెలకొంది. పరిగి ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో అయితే మధ్యాహ్నానికే విద్యార్థులను బయటకు పంపి పాఠశాలకు తాళం వేసిన సంఘటన చోటు చేసుకుంది. మండల వ్యాప్తంగా మరిన్ని పాఠశాలలో ఈ పరిస్థితి ఉన్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు వెల్లడించారు.


మధ్యాహ్నానికి పాఠశాలకు తాళం వేసిన దృశ్యం

బెస్త సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ధర్మవరం నివాసి బెస్త శ్రీనివాసులు (జనసేన పార్టీ)ను రాష్ట్ర బెస్తసంఘం కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు వారు మాట్లాడుతూ బెస్త సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఉపాధి హామీ పథకం కింద పనుల గుర్తింపునకు మండల వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 - 27 సంవత్సరానికి సంబంధించి ఉపాధి బడ్జెట్ జాబితా తయారీకి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని వేపరాల పెద్ద తండా, కట్టారుపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించామన్నారు. శనివారం గాండ్లపెంట, చామాలగొంది, మల్ల మీద పల్లి, జీన్లకుంట తదితర గ్రామాలలో గ్రామసభ నిర్వహిస్తామని చెప్పారు.

రొద్దం : ఉపాధి పనుల గుర్తింపునకు మండలంలోని రొద్దం సచివాలయం1లో గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి సంబంధించి సుమారు 2.50 కోట్లతో ప్రణాళిక తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు మాజీ జెడ్పిటిసి ఈ చిన్నప్పయ్య, మాజీ సర్పంచి పి చంద్రమౌళి, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి ఎస్ నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి ఎన్ రామకృష్ణ, ఈవోఆర్డీ గోవిందప్ప, ఏపీఓ సూర్యనారాయణ, టీఏ శ్రీనివాస్ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ జి నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది, రొద్దం పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ :ఉపాధి పనుల గుర్తింపును మండలంలోని ముక్తాపురం గ్రామంలోని సచివాలయంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభలో ఎంపిపితో పాటు ఇఒఆర్‌డి దివాకర్, వ్యవసాయశాఖ అధికారి రవీంద్ర, ఏపీవో గోపాల్, సర్పంచి హరి, కూటమి నాయకులు కృష్ణమూర్తి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


రొద్దం గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు